
ఆంధ్రజ్యోతి
**
ANDHRAJYOTHY



సూర్యాపేట
5
శనివారం 1 జూన్ 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్లు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.165	260	290
సూర్యాపేట	రూ.170	230	260
నల్లగొండ	రూ.152	220	250

ఉష్ణోగ్రత గరిష్ఠం 43.5 । కనిష్ఠం 25.4

ఫైడే



నల్లగొండ జిల్లాలో శుక్రవారం గరిష్ఠంగా కేతేపల్లి మండలంలో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దామచర్లలో 46.3, మిర్యాలగూడలో 45.9, కట్టంగూరులో 45.9, అనుములలో 45.8, నిడమనూరులో 45.7, నాంపల్లిలో 45.6, నకిరేకల్‌లో 45.5, త్రిపురారంలో 45.4, నేరేడుగొమ్ములో 45.2డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లా వ్యాప్తంగా సగటున 43.5డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా కోదాడలో 46.4డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మునగాలలో 46.4, చిలుకూరులో 46.1, చింతలపాలెంలో 46.1, పెన్‌పహాడ్‌లో 45.9, సూర్యాపేటలో 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలోని అన్ని మండలాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. తుంగతుర్తి మండలంలో అత్యల్పంగా 42.4డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయని నానుడి. దాన్ని నిజం చేసేలా ఎండలు మండుతున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లా నిప్పుల కొలిమిగా మారింది. మూడు రోజులుగా ఎండ తీవ్రత అధికమైంది. మే నెల చివరి రోజు రోహిణి కార్తెలో శుక్రవారం ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యాయి. నల్లగొండ జిల్లాలో 10మండలాల్లో 45డిగ్రీల ఉష్ణోగ్రత దాటడంతో రెడ్ అలర్ట్ జారీ చేశారు. మిగతా అన్ని మండలాల్లో 40 డిగ్రీల నుంచి 44.9డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. తీవ్ర ఎండలకు చిట్యాల మండల కేంద్రంలో కర్రి రాజు(40), గుర్రంపోడు మండల కేంద్రంలో రేపాక ముత్తమ్మ(64), ఊకొండి గ్రామానికి చెందిన కమ్మలపల్లి మమత(30) వడదెబ్బకు గురై మృతి చెందారు. - నల్లగొండ, సూర్యాపేట టౌన్

- కేతేపల్లిలో 46.8డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- 10 మండలాల్లో రెడ్ అలర్ట్ జారీ
- వడదెబ్బతో ముగ్గురు మృతి

భానుడి భగభగతో ఉక్కిరిబిక్కిరి





భానుడి ప్రతాపంతో ప్రజలు తల్లడిల్లుతున్నారు. ఇంటి నుంచి బయటికి వెళ్లాలంటే జంకుతున్నారు. ఉదయం 10 నుంచి అర్ధరాత్రి 12 గంటలవరకు వేడి గాలుల నుంచి ఉపశమనం కలగడం లేదు. ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో 47 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు దాటాయి. ప్రస్తుత నెలలో అడపాదడపా కురిసిన అకాల వర్షాలతో ఉష్ణోగ్రతలు తగ్గడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఈ నెల చివరి వారంలో రెండు మూడు రోజులుగా ఎండల తీవ్రత మళ్లీ పెరిగింది. ఫ్యాన్లు, కూలర్ల నుంచి కూడా ఉపశమనం కలగడం లేదు. గతంలో వేసవిలో రెడ్ అలర్ట్ ప్రకటించిన దాఖలాలు లేవు. కాగా, ఈ ఏడాది ఏప్రిల్ నుంచే పలు మండలాల్లో 45డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవడంతో అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటిస్తున్నారు. వేసవి తీవ్రతతో ప్రధాన రోడ్లపైకి జనం రావడం లేదు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండల నుంచి ఉపశమనానికి యువకులు ఈతకు వెళ్తున్నారు. ఎండ తీవ్రతతో రోజు కూలీ చేసుకునే ప్రజలు ఒక రోజు కూలీకి వేళ్తె రెండు రోజులు ఇంటి వద్దనే ఉంటున్నారు. రోడ్లపై తోపుడు బండ్లు, కూరగాయలు, పండ్లు విక్రయించే వారు ఎండ వేడితో గోడుగుల కింద వ్యాపారాలు చేస్తున్నారు. ఏదైనా పనినిమిత్తం బయటకు వచ్చిన ప్రజలు ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు.

గిర్రున తిరుగుతున్న విద్యుత్ మీటర్లు

జిల్లా కేంద్రానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి జనవరి నెలలో 100 నుంచి 120 యూనిట్ల వరకే విద్యుత్ వినియోగించారు. కాగా, మార్చి, ఏప్రిల్, మే నెలలో సుమారు 200 నుంచి 230 యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. ప్రతీ ఇంట్లో కూలర్, ఏసీలు, ఫ్యాన్లు ఒక్క నిమిషం కూడా ఆగడంలేదు.





నల్లగొండలో ఎండ వేడిమికి తట్టుకోలేక నీటిగుంతలో సేదతీరుతున్న గేదెలు

అవసరమైతేనే బయటకు రావాలి



ఎండలు ఎక్కువగా ఉండడంతో అవసరమైతేనే బయటకు రావాలి. తెల్లని, కాటన్ దుస్తులు ధరించాలి. మరో 15 రోజులు ఇదే పరిస్థితి ఉండవచ్చు. ప్రతీ అరగంటకోసారి తాగు నీటిని తీసుకోవాలి. వడదెబ్బ తగిలితే వెంటనే దగ్గరగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలి.

- కోటాచలం, సూర్యాపేట డీఎంహెచ్‌వో

నైరుతి రుతుపవనాల రాకపై సంకేతాలు



నైరుతి రుతుపవనాలు కేరళను రెండు రోజుల ముందే తాకాయని వాతావరణశాఖ ప్రకటించింది. సాధారణంగా జూన్ 1న కేరళలో ప్రవేశించే నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది రెండు రోజుల ముందుగానే వచ్చాయి. దీంతో జిల్లాలో జూన్ మొదటి వారంలో వర్షకాలం ప్రారంభమయ్యే అవకాశం ఉంది. వాస్తవానికి మృగశిర కార్తె నాటికి వర్షాలు కురుస్తాయి. ఈ సారి వర్షాలు ముందే వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎండవేడిమికి తట్టుకోలేక కోళ్లు మృతి

చండూరు రూరల్: ఎండవేడిమికి తట్టుకోలేక చండూరు మండలం దోనిపాముల గ్రామంలో సుమారు 1,500కోళ్లు శుక్రవారం మృతిచెందాయి. గ్రామానికి చెందిన చిలకరాజు పెద్దులు తనకున్న మూడెకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ ఎన్‌డీసీసీ బ్యాంక్ సహకారంతో రూ.10లక్షల రుణంతో 5 వేల సామర్థ్యం ఉన్న కోళ్ల షెడ్డును ఏర్పాటు చేసుకున్నాడు. షెడ్డుపై గడ్డి వేసి దాన్ని స్ప్రింక్లర్లతో గంట గంటకూ తడుపుతూ, షెడ్డులో కోళ్లకు ఫ్యాన్లు ఏర్పాటు చేసి కాపాడుకుంటున్నాడు. షెడ్డులో 4,500పిల్లలను తెచ్చి సాకుతుండగా, అవి సుమారు 1.8 కిలోల నుంచి 2కిలోలవరకు ఎదిగాయి.మరో నాలుగు రోజుల్లో మొత్తం కోళ్లను విక్రయించాలని భావించగా, విద్యుత్ కోతల కారణంగా ఎండ వేడిమిని తట్టుకోలేక 1500 కోళ్లు మృతిచెందాయి. దీంతో సుమారు రూ.3లక్షల రూపాయల నష్టం వాటిల్లింది.



మృతిచెందిన కోళ్లు

జీరో బిల్లులపై సూర్య ప్రతాపం

పెరిగిన విద్యుత్ వినియోగంతో తగ్గిన గృహజ్యోతి లబ్ధిదారులు



భువనగిరి టౌన్, మే 31: విద్యుత్ జీరో బిల్లుల లబ్ధిదారులపై వేసవి ప్రతాపం చూపింది. 200 యూనిట్లలోపు విద్యుత్ వాడిన గృహ కనెక్షన్లకు విద్యుత్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పేరిట మూడు నెలలుగా రద్దు చేస్తోంది. దీంతో జిల్లాలో సుమారు 1.25లక్షల మంది గృహ వినియోగదారులకు నెలవారీగా సుమారు రూ.3.80కోట్ల విద్యుత్ బిల్లుల భారం తప్పుతున్నది. ప్రభుత్వం 200 యూనిట్లలోపు విద్యుత్ బిల్లులను రద్దు చేస్తున్నా, మూడు నెలలుగా పెరుగుతున్న వేసవి తీవ్రతతో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వినియోగం పెరగడంతో విద్యుత్ వినియోగం కూడా అధికమైంది. దీంతో పలువురు 200 యూనిట్ల మార్క్‌ను దాటడంతో గృహజ్యోతి లబ్ధిని కోల్పోయి విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నారు. అయితే వేసవి తీవ్రత మరింత పెరిగిన నేపథ్యంలో జూన్ బిల్లులో కూడా జీరో బిల్లులు మరిన్ని తగ్గే అవకాశాలు ఉంటాయని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు.

తగ్గిన జీరో బిల్లులు

యాదాద్రి జిల్లాలో గృహ (క్యాటగిరీ-1) సర్వీసులు మే నాటికి 2,71,260 ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లింపుదారులు, 200 యూనిట్ల పైబడి విద్యుత్ వాడే వినియోగదారులు పోగా, 1,29,603 మందిని గృహజ్యోతి లబ్ధిదారులుగా గుర్తించారు. ఈ మేరకు మార్చిలో 1,27,756 మందికి గృహజ్యోతి వర్తించగా, వేసవి తీవ్రత కారణంగా మే నాటికి 3,851 మంది గృహజ్యోతి లబ్ధికి దూరమయ్యారు. అదే సమయంలో రూ.74,69,317 విద్యుత్ బిల్లులు చెల్లించారు. దీంతో ఎండాకాలం ముగింపు కోసం గృహజ్యోతి లబ్ధిదారులు ఎదురుచూస్తుండటం గమనార్హం. సూర్యాపేట జిల్లాలో 1,59,027 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, మార్చి నెలలో 1,54,240 కనెక్షన్లకు జీరో బిల్లులు రాగా, ఏప్రిల్ నెలలో 1,51,290 కనెక్షన్లకు జీరో బిల్లులు వచ్చాయి. ఒక నెల తేడాతో 2,950 మంది జీరో బిల్లుకు దూరమయ్యారు.

ఎన్నికల కోడ్ ముగిశాక గృహజ్యోతి దరఖాస్తులను స్వీకరిస్తారా?

గృహజ్యోతి లబ్ధి కోసం ఆశావహులు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం జరిగిన వడపోతలో జిల్లాలో గృహజ్యోతికి 1,29,603 విద్యుత్ సర్వీసుదారులను ట్రాన్స్‌కో యంత్రాంగం అర్హులుగా గుర్తించింది. కానీ, ఎంపికలో పలు తప్పిదాలు జరిగాయని, పలువురు అర్హులు ఎంపిక కాలేదని వాదనలు వెల్లువెత్తడంతో పాటు ఆందోళనలకు కూడా దిగారు. దీంతో ప్రభుత్వం అప్పట్లోనే అర్హుల నుంచి మరోమారు దరఖాస్తులను ఆహ్వానించింది. దీంతో మునిసిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలు ఆశావహులతో కిక్కిరిశాయి. ఇలోగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో దరఖాస్తుల పరిశీలన, నూతన దరఖాస్తుల ప్రక్రియ నిలిచింది. జూన్ 6తో ఎన్నికలకోడ్ ముగిసిన వెంటనే గృహజ్యోతి దరఖాస్తుల ప్రక్రియను పునఃప్రారంభించాలని ప్రభుత్వాన్ని పలువురు కోరుతున్నారు. దీంతో ప్రభుత్వ నిర్ణయం కోసం ఆశావహులు ఎదురు చూస్తున్నారు.

నెల	గృహ సర్వీసులు	అర్హత సర్వీసులు	జీరో బిల్లులు	సబ్సిడీ	నార్మల్ బిల్లు వచ్చిన కనెక్షన్లు
మార్చి	2,70,341	1,29,603	1,27,756(99.03శాతం)	రూ.3,08,54,080	1255
ఏప్రిల్	2,71,092	1,29,603	1,25,956(97.64 శాతం)	రూ.3,86,01,396	3049
మే	2,71,260	1,29,603	1,23,905(96.09 శాతం)	రూ.3,83,23,397	5048



వైభవంగా ఆండాల్ అమ్మవారి ఊంజల్ సేవ

భువనగిరి అర్బన్, మే 31: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో శుక్రవారం స్వామి వారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేద మంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణం సంప్రదాయ రీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాల్ అమ్మవారిని దివ్యమనోహరంగా అలంకరించి ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. అద్దాల మండపంలో ఊయలలో అధిష్ఠింపజేసి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. కాగా, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.39,43,778 ఆదాయం సమకూరింది.



అద్దాల మండపంలో ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

విత్తనాల కొరత లేకుండా చూడాలి

అదనపు కలెక్టర్ ప్రియాంక

మోతె, మే 31: విత్తనాల కొరత లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అన్నారు. శుక్రవారం మండలంలో విత్తన దుకాణాలు, హరిత హారం నర్సరీలు, ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాఘవాపురం క్రాస్‌రోడ్ వద్ద పెస్టిసైడ్ దుకాణాలను పరిశీలించారు. నకిలీ విత్తనాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. తుమ్మలపల్లి ప్రాథమిక పాఠశాలలో చేపడుతున్న పనులు వేగవంతం కాకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులు, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టిన హరితహారం వననర్సరీ, తడి, పొడి చెత్త తయారీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమయ్యే సమయం వస్తున్నా పాఠశాలల్లో చేపడుతున్న పనులు ముందుకు సాగకపోవడమేమిటని డీఈవోని ప్రశ్నించారు. కార్యక్రమంలో డీఈవో అశోక్ కుమార్, ఐబీ డీఈ రమేష్, ఇన్‌చార్జి ఎంపీడీవో హరిసింగ్ నాయక్, ఏవో అరుణ, ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి, ఆర్ఐ అజయ్, ఏఈ లింగయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మణికంఠ, కార్యదర్శులు పాల్గొన్నారు.



మోతె మండలం రాఘవాపురం విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

ప్రజల ఆదరాభిమానాలు చూరగొనాలి

ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేటక్రైం, మే 31: పోలీస్ వృత్తిలో అధికారులు ప్రజల ఆదరాభిమానాలు చూరగొనాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన నాగేందర్‌రావు దంపతులను అభినందించి మాట్లాడారు. ఉద్యోగ విరమణ అనంతరం సుఖసంతోషాలతో గడపాలని, ప్రజాసేవలో ముందుండాలన్నారు. పదవీ విరమణ కేవలం వయస్సుకే తప్ప సేవా కార్యక్రమాలకు కాదన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, ఏవో మంజు భార్గవి, పోలీస్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌గౌడ్, అంజన్‌రెడ్డి, వెంకయ్య, నాగేందర్‌రావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నాగేందర్‌రావును సన్మానిస్తున్న ఎస్పీ

ఆదర్శ పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తిచేయాలి

డీఆర్‌డీవో మధుసూదనరాజు

మునగాల రూరల్, మే 31: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తిచేయాలని డీఆర్‌డీవో మధుసూదనరాజు అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బడిబాట కార్యక్రమం, అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మొత్తంలో విద్యార్థులను చేర్పించాలని, ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న డ్రెస్, బుక్స్, నోట్‌బుక్స్, ఇతర సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శిరీష, తహసీల్దార్ అంజనేయులు, మండల పంచాయతీ అధికారి భూపాల్‌రెడ్డి, పర్యవేక్షకులు విజయలక్ష్మి, ఏపీఎం నగేష్, హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘం లీడర్లు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో

పేటలో గంజాయ్

- అర్ధరాత్రివేళ యువత వికృత చేష్టలు
- మత్తులో తూగుతున్న విద్యార్థులు, యువత



సూర్యాపేటటౌన్, మే 31: గంజాయి మత్తులో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని యువత ఊగుతోంది. గంజాయి తాగుతున్న యువకులు అర్ధరాత్రి వేళ వికృత చేష్టలకు పాల్పడుతుండడంతో మహిళలు, ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల మోతలతో ప్రధాన రహదారులపై చక్కర్లు కొడుతూ దాడులకు దిగుతున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రాజారాం కళాశాల సమీపంలో ఇటీవల భార్యాభర్తలు బైక్‌పై వెళుతుండగా గంజాయి మత్తులో ఉన్న వ్యక్తులు వెనుక కూర్చున్న మహిళపట్ల అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా ఇష్టానుసారంగా దూషించారు. కూలీలు పనులు చేసుకొని రాత్రి సమయంలో ఇంటికి వెళుతుంటే ఇదే యువకులు వారిపై దాడులకు దిగుతున్నారు. ఇలా సూర్యాపేటను గంజాయి మత్తు వదలడంలేదు. కొన్నేళ్లుగా సూర్యాపేటలో గంజాయి విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి యథేచ్ఛగా సూర్యాపేటకు గంజాయి సరఫరా అవుతుంది. సూర్యాపేట కాకుండా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిషేధిత గంజాయి గుప్పుమంటుంది. గంజాయి, గుట్కా, మాదక ద్రవ్యాల విక్రయాలకు జిల్లాకేంద్రం కేంద్రంగా మారింది. ఆంధ్రా నుంచి గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్, పరిసర ప్రాంతాలతోపాటు పలు జిల్లా కేంద్రాల్లో కూడా విక్రయాలు సాగిస్తున్నారు. నిషేధిత గంజాయి సరఫరా చేస్తున్న వారిని పోలీసులు పట్టుకొని కేసులు నమోదు చేసి జైలుకు పంపినా ఈ దందాలు మాత్రం యథావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో జిల్లాలో విద్యార్థులు, యువత మత్తులో తూగుతున్నారు. జిల్లాలో ఎక్కువగా పాఠశాల, ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు మత్తుకు బానిసలయ్యారు. ముఖ్యంగా పేట జిల్లాకేంద్రంలోని ఓ కళాశాల సమీపంలో, హైటెక్ బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం సమీపం, చంద్రన్నకుంట,రాజీవ్‌నగర్‌తో పాటు పట్టణ సమీపంలో ఏర్పాటు చేసిన వెంచర్లలో, 60అడుగుల రోడ్డు,పలు కేఫ్‌లలో రోజు రాత్రి సమయంలో గంజాయి తాగడానికి సమయం కేటాయిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా

జిల్లాకు గంజాయి, గుట్కాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం, ఛత్తీస్‌ఘడ్, కర్ణాటక రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి సరఫరా అవుతున్నాయి. సూర్యాపేట, కోదాడ, హుజుర్‌నగర్, నల్లగొండ, నకిరేకల్, చౌటుప్పల్, భువనగిరి, యాదగిరిగుట్ట, మిర్యాలగూడ పట్టణాల్లో కొందరు ఏజెంట్లను నియమించుకొని దందా సాగిస్తున్నారు. వివిధ రకాల వాహనాల్లో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి, గుట్కాని సరఫరా చేస్తున్నారు. కిలో గంజాయి విలువ హోల్‌సేల్‌గా రూ.10వేలు ఉంటుంది. క్వింటా గంజాయి విలువ రూ.10లక్షలు నుంచి రూ.12లక్షల దాకా విక్రయిస్తున్నట్లు సమాచారం.

పేట్రేగుతున్న విద్యార్థులు, యువత

జిల్లాకేంద్రంలోని పలు వీధుల్లో ఉన్న చౌరస్తాల్లో ఉన్న చిన్నచిన్న కిరాణ దుకాణాలు అడ్డాగా చేసుకొని యువకులు గంజాయి తాగుతున్నారు. రాత్రి 12గంటల వరకు తాగుతూ పలువురిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆ సమయంలో అటుగా భార్యాభర్తలు, మహిళలు, బాలికలు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. అంతేకాకుండా దుకాణాలు, హోటళ్లలో పనిచేసి, రాత్రి సమయంలో ఇంటికి వెళ్లే మహిళలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రానికి చెందిన అమేర్ అనే యువకుడు జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ ఎస్టీ హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో భాగంగా మే 13వ తేదీన విధులకు వెళుతుండగా మత్తులో ఉన్న కొంతమంది యువకులు అమేర్‌తో గొడవపడి దాడిచేశారు. దీంతో యువకుడి వెన్నుపూసపై బలంగాకొట్టారు. ఇదే విషయంపై అమేర్ కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, గంజాయి సేవించి దాడికి పాల్పడిన యువకులను గుర్తించి కేసులునమోదు చేశారు.

పోలీసులకు సహకరించాలి



జిల్లాలో గంజాయికి సంబంధించి ఏ చిన్న విషయమైనా పోలీసులకు సమాచారం ఇచ్చి ప్రజలు సహకరించాలి. జిల్లాలో గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతాం. గంజాయిని సరఫరా చేసి విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా గంజాయికి బానిసలైన వారిని గుర్తించి అవగాహన కల్పిస్తాం. గంజాయి దందాలో ఎంతటి వారున్నా ఉపేక్షించేది లేదు. గంజాయి ప్రభావంతో విద్యార్థులు, యువత భవిష్యత్ నాశనమవుతుంది.

- రాహుల్‌హెగ్డే, ఎస్పీ

మట్టపల్లిలో వైభవంగా నృసింహుడి కల్యాణం

మఠంపల్లి, మే 31: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య శాశ్వత కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్చరణల నడుమ వైభవంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం మాంగళ్యధారణతో నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్ అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా లక్ష మల్లె పుష్పార్చన

సూర్యాపేట అర్బన్: జిల్లాకేంద్రంలోని శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం హనుమాన్ జయంతి సందర్భంగా లక్ష మల్లె పుష్పార్చన సామూహికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ధరూరి శ్రీరామానుజాచార్యులు మాట్లాడుతూ అఖండ ఆరాధన, విశ్వక్సేన పూజ, సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈవో వై.శ్రీనివాసరెడ్డి, దేవాలయ ధర్మకర్తలు కొత్త అంజనేయులు, ధరూరి శ్రీధరాచార్యులు, ధరూరి శ్రీనాథచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

నకిలీ విత్తన విక్రేతలపై చర్యలు తీసుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

సూర్యాపేటరూరల్, మే 31: వ్యవసాయ శాఖ అధికారులు ఫర్టిలైజర్స్ దుకాణాలపై దాడులు నిర్వహించి నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న డీలర్లపై పీడీయాక్టు నమోదు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాయినిగూడెం సమీపంలో ఉన్న వికాస్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఖరీఫ్ ప్రారంభమవుతున్నందున రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల అందుబాటులో ఉండేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ పంట సాగుకు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం రైతుబంధు నిధులు వెంటనే రైతుల ఖాతాల్లో జమయ్యేలా చూడాలని కోరారు. అన్నిరకాల విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ధరలకే అందించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. రైతులకు రుణమాఫీ చేసి రైతులను రుణవిముక్తి చేయాలన్నారు. అదేవిధంగా రాయినిగూడెం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్‌నేత గుర్రం వీరారెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా, మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యులు జి. నాగయ్య, మల్లు లక్ష్మి, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, నాయకులు యాదగిరిరావు, పారపెల్లి శేఖర్, మట్టిపల్లి సైదులు, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి



ఆర్థిక ఇబ్బందులతో
యువకుడి బలవన్మరణం

కేతేపల్లి, మే 31: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకు డు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని భీమారం గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ శివతేజ తెలిపిన మేరకు సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అవిరెం డ్ల ఉపేందర్ (30)వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుం బ పోషణతో పాటు వ్యవసాయ ఖర్చులకు చేసిన అప్పులు తీర్చలేక మనస్థాపంతో గురువారం రాత్రి ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబస భ్యులు చికిత్స నిమిత్తం ఉపేందర్‌ను సూర్యాపేట కేంద్రప్రభుత్వ ఆసు పత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెంది నట్లు తెలిపారు. ఈ సంఘటనపై మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివతేజ వివ రించారు. మృతు డు ఉపేందర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

హత్య చేసిన వ్యక్తికి రిమాండ్

చిట్యాలరూరల్, మే, 31: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో గురువారం వృద్ధుడిని హత్య చేసిన నిందితుడిని అ రెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నార్కట్‌పల్లి సీఐ కె. నాగరాజు, చిట్యాల ఎస్‌ఐ డి. సైదాబాబు తెలిపారు. గుండ్రాంపల్లిలో జవ్వాజి సా యిలును వ్యవసాయ పొలం వద్ద సాయిలు వరుసకు మనువడు అయిన జవ్వాజి శ్యామ్ గొడ్డలితో దాడి చేసి హత్య చేశాడు. అనం తరం పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. హత్యపై విచారణ జరిపి శ్యా మ్‌ను అరెస్టు చేసి న్యా యస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించినట్లు వారు పేర్కొన్నారు.

నర్సింహాపురంలో నేవీ ఉద్యోగికి అంత్యక్రియలు

- *కర్ణాటక రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సందీప్‌రెడ్డి*
- *స్వగ్రామంలో విషాదఛాయలు*

నకిరేకల్, మే 31: కర్ణాటక రాష్ట్రంలో మే 28వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో నకిరేకల్ మండలం నర్సింహాపురం గ్రామానికి చెందిన నేవీ ఉద్యోగి మారెడ్డి సందీప్‌రెడ్డి (27) మృతి చెందారు. మృతదేహానికి స్వగ్రా మంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. మారెడ్డి లింగారెడ్డి, మంగమ్మ దంప తులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. లింగారెడ్డి వ్యవసాయ పనులు చేసు కుంటూ ఇద్దరు కమారులను ఉన్నత చదువులు చదివించారు. మారెడ్డి మహేశ్వర్‌రెడ్డి మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మైనార్టీ జూనియర్ కళాశా లలో అవుట్‌సోర్సింగ్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు సందీప్ రెడ్డి ఆరేళ్ల క్రితం నేవీలో చేరి కర్ణాటకలోని కర్వార్‌లో నేవీకి సంబంధించిన లాజిస్టిక్స్ డిపార్ట్‌మెంట్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనకు నెల రోజులు సెలవులు దొరకడంతో ఏప్రిల్‌లో స్వగ్రా మానికి వచ్చారు. సెలవులు ముగియడంతో మే 27న స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై మహ బూబ్‌నగర్‌లో ఉంటున్న అన్నయ్య దగ్గరకు వెళ్లా డు. మే 28న సందీప్‌రెడ్డి హైదరాబాద్‌కు చెందిన సహ ఉద్యోగితో కలిసి ద్విచక్ర వాహనాలపై కర్ణాట క రాష్ట్రంలోని కర్వార్‌కు బయలుదేరారు. మార్గమ ధ్యలో ఉగ్గీ జిల్లా అనిగిరి సమీపంలో సందీప్‌రెడ్డి నడుపుతున్న బైక్ అదుపుతప్పి కింద పడిపోవడం తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామమైన నర్సింహా పురం తీసుకవచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహం వెంట నేవీ అధికారులు సూర్యభవీవర్గీ, నాగరాజు, ఆషిష్ వచ్చి మృతదేహం వద్ద గౌర వవందనం చేసి అంత్యక్రియలు పూర్తి చేశారు.


సందీప్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

యువకుల ఘర్షణ : ఇంటిపై దాడి

- *నలుగురికి గాయాలు, ఏడుగురిపై హత్యాయత్నం కేసు*

చిట్యాలరూరల్, మే 31: మద్యం మత్తులో యువకులు ఘర్షణ పడి ఇంటిపై దాడి చేశా రు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. చిట్యాల ఎస్‌ఐ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రుద్రారపు భిక్షం కుమారులు మహేష్, ప్రవీణ్‌లతో పాటు పలువురు యువకులు మరో యువ కుడితో ఘర్షణ పడ్డారు. అంతేకాక దాడి చేస్తుండగా అదే గ్రామానికి చెందిన బొమ్మగోని పర మేష్ మధ్యలో వెళ్లి వారిని విడిపించే ప్రయత్నం చేశారు. అనంతరం ఆయన తన నివాసానికి వెళ్లాడు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న మహేష్, ప్రవీణ్, వారి తండ్రి భిక్షంతో పాటుగా మరో నలుగురు వ్యక్తులు కలిసి మూకుమ్మడిగా బొమ్మగాని నర్సింహ ఇంటికి వెళ్లాడు. కర్రలతో పరమేష్ ఇంటికి వెళ్లి పరమేష్‌తో పాటు అతని తండ్రి నర్సింహపై దాడి చేశాడు. ఈ ఘటనలో వారిద్దరితో పాటుగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. గాయాలైన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఇరువర్గాలు చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాయి. విచారణ చేసిన పోలీసులు బొమ్మగాని నర్సింహ నివాసంపై కర్రలతో వెళ్లి దాడి చేసి హత్యాయత్నం చేశారని నిర్ధారించారు. దాడి చేసేందుకు వెళ్లిన రుద్రారపు ప్రవీణ్, రుద్రారపు మహేష్, రుద్రారపు బన్నీ, రుద్రారపు సాయి, వీరమళ్ల చరణ్, వీరమళ్ల జగదీష్, రుద్రారపు భిక్షంలపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి
కల్లుగీత కార్మికుడికి తీవ్రగాయాలు

కనగల్, మే 31: తాటి చెట్టు పైనుంచి పడిపో వడం తో కల్లుగీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని పర్వతగిరి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్ర కారం... గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు తండు సైదులుగౌడ్ (50) గురువారం సాయంత్రం రోజు మా దిరిగానే కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ప్ర మాదవశాత్తూ తాటిచెట్టు పైనుంచి పడిపోవడంతో తీ వ్ర గాయాలపాలైయ్యాడు. గమనించిన స్థానికులు వెం టనే సైదులుగౌడ్‌ను నల్లగొండ జిల్లా కేంద్రాస్పత్రికి త రలించారు. పరీక్షించిన వైద్యులు వెన్నుపూస, కుడి భుజం విరిగి లోపల అవయవాలు కూడా గాయాలైన ట్లు తెలిపారు. అనంతరం అతడిని చికిత్స నిమిత్తం న ల్లగొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరి స్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.











తెలంగాణ బలి దేవత కాంగ్రెస్సే

- వందలాది మంది అమరులయ్యింది ఆ పార్టీ వల్లే...
- అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది?
- కాంగ్రెస్ పదేళ్ల తాత్సారం వల్లే కదా బలి దానాలు: కేటీఆర్



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో వందలాది మంది అమరులయ్యింది ఎవరి వల్ల? అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది.. గతంలో రేవంత్‌రెడ్డి చెప్పినట్లు తెలంగాణ బిడ్డల్ని చంపిన బలి దేవత ఎవరు...? అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ప్రశ్నించారు. 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్‌ను ఆయన శుక్రవారం విమర్శించారు. 1952లోనే ఉమ్మడి రాష్ట్రం వద్దని, హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగానే ఉండాలని పోరాటం చేస్తున్న విద్యార్థులపై సిటీ కాలేజీ వద్ద కాల్పులు జరిపి ఆరుగురిని బలిగొన్నది, 1969-71 తొలిదశ ఉద్యమంలో 370 మంది తెలంగాణ బిడ్డల్ని కాల్చి చంపింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాదా..? అని నిలదీశారు. 1971 పార్లమెంట్ ఎన్నికల్లో 11/14 సీట్లలో తెలంగాణ ప్రజా సమితి పార్టీని గెలిపిస్తే ఆ పార్టీని మాయం చేసింది, దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజాస్వామికంగా తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తే, తెలంగాణను తుంగలో తొక్కింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. 2004లో మాట ఇచ్చి, పదేళ్ల తాత్సారం చేసి వందలాది మంది తెలంగాణ బిడ్డలు ఆత్మ బలిదానం చేసుకునే దుస్థితికి కారణమైంది అప్పుడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్సేనని కేటీఆర్ ఆరోపించారు.

తెలంగాణ తేజం పాటను ఆవిష్కరించిన కేసీఆర్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తేజం పేరిట కేసీఆర్(కేశవ చంద్ర రమావత్) సినిమా కోసం రూపొందించిన పాటను మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవిష్కరించారు. నటుడు రాకింగ్ రాకేష్ నిర్మించిన కేసీఆర్ సినిమాలోని ఆ పాటను శుక్రవారం నంది నగర్‌లోని కేసీఆర్ నివాసంలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీ డి.దామోదర్ రావు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, మధుసూదనాచారి, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, యాంకర్ జోర్దార్ సుజాత, సింగర్ విహ, గీత రచయిత సంజయ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ర్యాలీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం ర్యాలీ జరగనుంది. రాష్ట్ర అవతరణ వేడుకలను బీఆర్ఎస్ పార్టీ మూడు రోజులు పాటు నిర్వహించాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం పబ్లిక్ గార్డెన్స్ నుంచి అసెంబ్లీ ఎదుట ఉన్న అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా పాల్గొంటారు.

ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్‌పై దుష్ప్రచారం

- టీవీ, యూట్యూబ్ చానళ్లపై పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

బంజారాహిల్స్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్ పాత్ర లేకపోయినప్పటికీ కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు ఉద్దేశ్యపూర్వకంగా ఆయన పేరును బదనాం చేస్తున్నాయంటూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ పార్టీ నేతలతో కలిసి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ప్రభుత్వం కోరినట్టు ఇంటెలిజెన్స్ ఇతర విభాగాల అధికారులు నివేదికలు ఇచ్చారు తప్పితే ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేసీఆర్ పాత్ర ఉన్నట్టు ఎక్కడా నిర్ధారణ కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అరెస్టయిన పోలీసు అధికారులు వాంగ్మూలం ఇచ్చారంటూ కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు కేసీఆర్ పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా విష ప్రచారం నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్

- ప్రజా సమస్యలు వదిలి.. ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్షలా?
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు చేస్తున్నాయని.. దేశంలో శత్రువులుగా ఉంటున్న ఆ రెండు పార్టీలు తెలంగాణలో మిత్రులుగా వ్యవహరిస్తున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్ష చేపట్టడంపై శుక్రవారం ఆయన స్పందించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఫోన్‌ట్యాపింగ్‌పై దీక్ష చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, విపక్ష నాయకుల ఫోన్ల మీద కేంద్రం పెగాసస్ వాడిందన్న ఆరోపణలపై విచారణకు ఎందుకు డిమాండ్ చేయలేదో రాష్ట్ర బీజేపీ నాయకులు చెప్పాలన్నారు.

రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే నకిలీ మద్యం: క్రిశాంక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లో నకిలీ మద్యం అమ్ముతున్నారని సీజ్ చేసిన సోమ్ డిస్టిలరీస్ కంపెనీని రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడకు తెస్తోందని బీఆర్ఎస్‌నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. మధ్యప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ విభాగానికి ఈ బీరు కంపెనీ.. రూ.575 కోట్ల రుణాన్ని ఎగవేసిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖ వాస్తవాలు తెలుసుకోకుండా అటువంటి సంస్థకు ఎలా అనుమతిచ్చారని మంత్రి జూపల్లిని ప్రశ్నించారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ వాయిదా వేయండి: ఆర్ఎస్పీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఈ నెల 9న నిర్వహించొద్దని, ఆ పరీక్షను వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. అదేరోజు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) పరీక్ష కూడా ఉందని, చాలా మంది నిరుద్యోగులు ఐబీ పరీక్ష రాస్తున్నారని, ఎన్నికల కారణంగా పలువురు ప్రభుత్వ ఉద్యోగులు గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు సన్నద్ధం కాలేదని తెలిపారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షను నెలరోజులు వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

జోరుగా నిషేధిత బీటీ పత్తి విత్తనాల విక్రయాలు

- రెండు ముఠాలకు చెందిన ఐదుగురి అరెస్ట్



మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్న నిషేధిత పత్తివిత్తనాలు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): నిషేధిత బీటీ పత్తివిత్తనాలను విక్రయిస్తున్న రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు 1000 కిలోల బీటీ పత్తివిత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత పత్తివిత్తనాల రవాణా జరుగుతోందన్న సమాచారంతో మహేశ్వరం ఎస్‌వోటీ, మాడ్గుల్ పోలీసులు కలిసి బ్రహ్మంపల్లి గ్రామం వద్ద నిఘా పెట్టారు. కారులో నిషేధిత పత్తి విత్తనాలు తరలిస్తున్న రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కొత్త బ్రాహ్మణపల్లికి చెందిన దుగ్గిపూడి మారెడ్డి (58), అల్లం వినోద్ కుమార్ (42), అల్లం మారెడ్డిని అరెస్ట్ చేశారు. మరో ఘటనలో నాచారంలోని వైష్ణవి అగ్రిటెక్ సంస్థలో పనిచేస్తున్న షాద్‌నగర్‌కు చెందిన ఎర్రదొడ్డి నల్లపారెడ్డి సత్యపాల్‌రెడ్డి (52), కేశంపేటకు చెందిన అన్నపురెడ్డి మల్లారెడ్డి (44)ని అరెస్ట్ చేసి.. వారి నుంచి నిషేధిత పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి సుమారు వేయి కిలోల నిషేధిత పత్తివిత్తనాలు, 5 ఫోన్లు, వేయింగ్ మిషన్, ఓ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేడు గవర్నర్‌ను కలవనున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు(శనివారం) కలవనున్నారు. ఉదయం 10 గంటలకు రాజ్‌భవన్‌కు వెళ్లి... గవర్నర్‌తో సమావేశం కానున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని గవర్నర్‌ను సీఎం ఆహ్వానించనున్నారు. కాగా, మహారాష్ట్రలో రుణమాఫీ పథకం అమలు ఎలా జరిగిందనే విషయంపై అధ్యయనానికి రాష్ట్రం నుంచి మహారాష్ట్ర వెళ్లిన అధికారుల బృందం రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో నివేదిక ఇవ్వనుంది.

ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)




కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందా..? కేసీఆర్‌పై చర్య తీసుకోకపోవడానికి కారణమేంటి..? ప్రజలకు రేవంత్ సమాధానం చెప్పాలి" అని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, దానిని కక్కిస్తామని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్.. ఇప్పుడు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత దిగజారుడు రాజకీయాలకు పాల్పడిందో జైల్లో ఉన్న పోలీసు అధికారుల నేరాంగీకార పత్రాలను పరిశీలిస్తే అర్థమవుతోందని లక్ష్మణ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో వ్యాపారులను హింసించి డబ్బులు వసూలుచేశారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బీఎల్ సంతోష్‌పై పెట్టిన కేసులను పరిశీలించాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు.

రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనున్న రాష్ట్రం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనుంది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు శుక్రవారం ఇండెంట్ పెట్టింది. 16 ఏళ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్లు, 19 ఏళ్ల కాల పరిమితితో మరో రూ.1,000 కోట్లను రుణంగా తీసుకోనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.4,000 కోట్ల అప్పు కోసం ఇండెంట్ పెట్టింది. తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని 11 రాష్ట్రాలు రూ.19,500 కోట్ల అప్పుల కోసం ఆర్‌బీఐని ఆశ్రయించాయి. జూన్ 4న జరిగే ఈ-వేలం ద్వారా ఈ అప్పులు తీసుకోనున్నాయి.

కేసీఆర్‌ను కాపాడేందుకే బీజేపీ నేతల ధర్నాలు

- అందుకే సీబీఐ విచారణ కోరుతున్నరు: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కాపాడేందుకే ఆ పార్టీ మిత్రపక్షమైన బీజేపీ.. సీబీఐ విచారణ కోరుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలంటూ బీజేపీ నిరసన చేపట్టడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కొమ్ము కాసినందుకు ప్రతిఫలంగా కేసీఆర్‌ను కాపాడాలని ఆ పార్టీ చూస్తోందన్నారు. ట్యాపింగ్ కేసు నుంచి కేసీఆర్‌ను కాపాడడం ఎవరి తరమూ కాదన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బీఎల్ సంతోష్‌ను ఇరికించారని చెబుతున్న బీజేపీ.. దాన్ని ఎందుకు నిరూపించలేకపోయిందన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీ అనుబంధ సంస్థగా మార్చేశారనిఎద్దేవా చేశారు. ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌లను కాపాడేందుకే బీజేపీ నేతలు ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి.. అప్పట్లోనే కేంద్రానికి ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అసలు మోదీ ప్రభుత్వమే ఫోన్ ట్యాపింగ్‌లు చేస్తుందన్న ఆరోపణలూ ఉన్నాయన్నారు. ముందు ఆ ఆరోపణలపై సీబీఐ విచారణ చేయించుకోవాలని హితవు పలికారు.

అక్టోబరులో స్థానిక ఎన్నికలు!

ఒకేసారి పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. రుణమాఫీ పూర్తయ్యాకే నిర్వహించే అవకాశం

- అప్పటికి బీసీ రిజర్వేషన్లూ కొలిక్కి తెచ్చే కసరత్తు



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలతోపాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకూ ఒకే సారి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయడంతోపాటు బీసీ రిజర్వేషన్ల అంశం తేలాకే ఈ ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో సర్కారు ఉన్నట్లు తెలిసింది. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జూన్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, బీసీ రిజర్వేషన్ల విషయం తేలకపోవడం, కులగణనకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉండడంతో తర్జనభర్జన పడుతోంది. కులగణన వివరాల ప్రకారం కాకుండా.. కేవలం ఓటరు జాబితాలో పేర్కొన్న కులాల వారీగా రిజర్వేషన్లను లెక్కగట్టి ఎన్నికలకు వెళ్తే.. కోర్టుల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. మరోవైపు ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రుణమాఫీ పూర్తయితే ప్రజల్లో సానుకూలత పెరుగుతుందని ఆ పార్టీ భావిస్తోంది. అప్పటిలోగా కులగణనపైనా స్పష్టత వస్తుందని, అక్టోబరులో ఎన్నికలను నిర్వహిస్తే బాగుంటుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

రిజర్వేషన్ల ఖరారుపై సమాలోచన

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటే ముందుగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగ బద్ధంగా రిజర్వేషన్లను కల్పిస్తున్నారు. బీసీలకు మాత్రం ఆయా రాష్ట్రాలు వాటి విచక్షణ మేరకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలను జరుపుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో బీసీ జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లను పెంచాలనే డిమాండ్ కొన్నేళ్లుగా ఉంది. అయితే, రిజర్వేషన్లు 50శాతం కంటే మించకూడదని గతంలో సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలను జారీచేసింది. దీంతో ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధ విధానంలో జనాభా దామాషా ప్రకారం పోగా.. మిగిలింది బీసీలకు కేటాయించాల్సి రావడమే సమస్యగా పరిణమించింది. ఈ విధానం కోసమైతే ఓటరు జాబితాను పరిశీలించి, వివరాలు సేకరిస్తే రిజర్వేషన్లను నిర్ణయించవచ్చు. అయితే, అప్పుడు తమకు రిజర్వేషన్ తగ్గిందనే అంశంపై బీసీలు సహా ఎవరైనా కోర్టుకు వెళ్తే మొత్తం ఎన్నికలపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 23 శాతానికి తగ్గించింది. ఇదే విధానంలో 2019లో స్థానిక ఎన్నికలను నిర్వహించింది. అప్పుడు కొంతమంది కోర్టుకు వెళ్లడంతో.. ఆ ప్రభుత్వాన్ని కోర్టు ఈ విధానంలో ఎందుకు వెళ్లారంటూ మందలించింది. ఈ ఒక్కసారికి అనుమతించాలని, తరువాత నిర్వహించబోయే ఎన్నికలకు రిజర్వేషన్లను తేల్చి, దాని ప్రకారమే నిర్వహిస్తామని గత ప్రభుత్వం కోర్టుకు చెప్పింది. కానీ, ఆతర్వాత ఇందుకు అవసరమైన చర్యలను తీసుకోకపోవడం ప్రస్తుత ప్రభుత్వానికి సమస్యగా మారింది. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖరారు చేయాల్సిన బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలోని పూర్తిస్థాయి డెడికేటెడ్ కమిషన్ (బీసీ కమిషన్) కృషి చేస్తోంది. కుల సంఘాలతో పాటు, నిపుణులు, ప్రొఫెసర్లతో వరుస సమావేశాలను జరుపుతోంది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగియగానే ఇందుకు సంబంధించిన పలు అంశాలను సీఎంతోనూ చర్చించి, ఒక నివేదికను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. కాగా, ఆగస్టులో ప్రస్తుత బీసీ కమిషన్ పదవీకాలం ముగియనుంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కమిషన్‌నే కొనసాగిస్తుందా, లేక కొత్త కమిషన్‌ను నియమిస్తుందా అన్నది తెలియాల్సి ఉంది.

ఒకే సారి నిర్వహిస్తే...

సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు మూడు దఫాల్లో నిర్వహిస్తే.. మూడుసార్లు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలో గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు ఏదో ఒక ఎన్నిక జరుగుతుండగా.. నెలలపాటు కోడ్ అమల్లో ఉంది. దీంతో ప్రభుత్వ పనులు ఆలస్యమవడంతో పాటు, సామాన్య జనానికి కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితి మళ్లీ పునరావృతం కాకూడదంటే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఒకే సారి నిర్వహించాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ మూడు ఎన్నికలకు రిజర్వేషన్ల అంశం ముడిపడి ఉన్నాయని, జూన్ నుంచి ఆగస్టు వరకు సమయం ఉంటే ఈ అంశాన్ని తేల్చేసే అవకాశం ఉంటుందని సర్కారు భావిస్తోంది. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచనలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు రిజర్వేషన్ల అంశం కొలిక్కి వస్తే.. సెప్టెంబరు లేదా అక్టోబరులో మూడు ఎన్నికలతో గ్రామీణ ప్రాంతాల్లో తీన్ మార్ మోగనుంది.

రూపు మారనున్న మాతా శిశు సంరక్షణ పథకం

కేసీఆర్ కిట్ ఔట్.. ఎంసీహెచ్ కిట్ ఇన్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణకు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన కేసీఆర్ కిట్ పేరును ఇప్పటికే రేవంత్ సర్కారు తొలగించింది. దాని స్థానంలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్(ఎంసీహెచ్) కిట్ పేరుతో అమలు చేస్తోంది. అంతేకాక ఈ పథకం రూపురేఖల్ని పూర్తిగా మార్చేయబోతోంది. ప్రధానంగా దీన్ని ఎలా నిర్వహించాలన్న దానిపై కసరత్తు ప్రారంభించింది. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పథకాన్ని నడపాలా? లేక కేంద్రం ఇచ్చే ప్రధాన మంత్రి మాతృవందన యోజన(పీఎంఎంవీవై)తో కలిపి కొనసాగించాలా అన్నదానిపై చర్చిస్తున్నారు. ఈ పథకంపై ఇటీవలే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ కారణంగా దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కోడ్ ముగియగానే కేంద్రం భాగస్వామ్యంతోనా... లేక రాష్ట్ర ప్రభుత్వ నిధులతో దీన్ని నిర్వహిస్తారా అన్న దానిపై స్పష్టత రానుంది.

రాష్ట్ర ప్రభుత్వంపై భారం తగ్గే ఛాన్స్

ప్రస్తుతం పీఎంఎంవీవై కింద కేంద్రం గర్భిణులకు రూ.6 వేల ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. కేంద్రం ఇచ్చే నిధులను తీసుకొని.. దానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున కొంత జమ చేస్తే... పాత పద్ధతిలోనే ఎంసీహెచ్ కిట్ కింద రూ. 13 వేలు ఇవ్వవచ్చు. కేంద్ర ప్రభుత్వ పథకంతో కలిపి అమలుచేయడం వల్ల రేవంత్ సర్కారుపై ఆర్థిక భారం కూడా సగానికిపైగా తగ్గుతుంది. ఇదే విషయాన్ని అధికారులు మంత్రికి వివరించినట్లు తెలుస్తోంది. కాకపోతే కేంద్రం నిధులను ఈ పథకం కింద వినియోగిస్తే... కచ్చితంగా పేరు, బ్రాండింగ్‌లో వారి నియమ నిబంధనలను పాటించాల్సివుంటుందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. దీంతో రెండు రకాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, జూన్ 4 తర్వాత తుది నిర్ణయం తీసుకుందామని అధికారులకు మంత్రి సూచించినట్టు చెప్తున్నారు.

తెలంగాణ చిహ్నంలో అమరుల స్థూపం పెడితే.. మీకెందుకు బాధ?

- కీరవాణికి ఆస్కార్ వచ్చినప్పుడు.. కేసీఆర్, కేటీఆర్ అభినందించలేదా?
- మహేష్ కుమార్ గౌడ్
- సమ్మక్క సారలమ్మలను చంపింది కాకతీయరాజులు కాదా?: బెల్లయ్యనాయక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): "ఉద్యమకారుల అభిప్రాయం మేరకు తెలంగాణ చిహ్నంలో అమరవీరుల స్థూపం పెడితే మీకెందుకు కడుపు నొప్పి?" అంటూ బీఆర్ఎస్ నేతలను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. నిజమైన తెలంగాణ వాదులు కోరుకున్న దిశగా కాంగ్రెస్ ప్రభుత్వ అడుగులు పడుతుంటే.. కేసీఆర్ కుటుంబం నానా యాగీ చేయాలని చూస్తుందన్నారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అమరుల స్థూపానికి రూ. వంద కోట్లు వెచ్చించిన కేసీఆర్ ప్రభుత్వం.. అందులో ఒక్క అమరవీరుని పేరయినా చెక్కిందా అని ప్రశ్నించారు. చిన జీయర్ స్వామిని తీసుకువచ్చి కుర్చీలో కూర్చోపెట్టినప్పుడు, అందెశ్రీ గీతాన్ని సీమాంధ్ర గాయకుడు రామకృష్ణతో పాడించినప్పుడు, ప్రభుత్వ అంబాసిడర్లుగా రకుల్ ప్రీత్ సింగ్, మంచు లక్ష్మి, పుల్లెల గోపీచంద్‌లను నియమించినప్పుడు, రోజా ఇంటికి వెళ్లి ఆంధ్రా బిర్యానీని తిన్నప్పుడు, పనికిరాని ఒక ప్రాజెక్టును కట్టి.. దాని ప్రారంభోత్సవానికి ఏపీ సీఎంను ఆహ్వానించినప్పుడు, శారదాపీఠానికి తెలంగాణలో భూములు ఇచ్చినప్పుడు కేసీఆర్‌కు సెంటిమెంటు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కీరవాణికి ఆస్కార్ అవార్డు వస్తే.. ఇదే కేసీఆర్, కేటీఆర్ ట్విట్టర్ వేదికగా అభినందించారని గుర్తు చేశారు. ఒక మంచి గీతానికి సంగీతం సమకూర్చేందుకు కీరవాణిని సంప్రదిస్తే.. నానా యాగీ చేస్తున్నారని విమర్శించారు. కీరవాణి ఎంపిక అన్నది అందెశ్రీ ఆలోచనేనని వెల్లడించారు. మెజారిటీ ప్రజల అభిప్రాయం ప్రకారం తెలంగాణ చిహ్నం ఎంపిక జరుగుతుందన్నారు. మల్లు రవి మాట్లాడుతూ 2023 ఎన్నికలకు ముందే.. టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి రాచరిక పాలన తీసేసి ప్రజా పాలన తీసుకువస్తామని చెప్పారని, అందులో భాగమే రాచరిక చిహ్నాల తీసివేతన్నారు. ప్రజా పాలనలో భాగంగానే జయజయహే తెలంగాణ పాటని అధికారిక గేయంగా చేస్తున్నట్లు చెప్పారు."తెలంగాణ చిహ్నంలో కాకతీయుల కళాతోరణం కావాలా..?అమరవీరుల స్థూపం వద్దా? సమ్మక్క, సారలమ్మలను చంపింది కాకతీయ రాజులు కాదా? నాతో సహా.. రాష్ట్రంలో 12% ఉన్న గిరిజనులు కాకతీయ కళాతోరణాన్ని ఎందుకు ఒప్పుకోవాలి?" అంటూ టీపీసీసీ ఆదివాసీ సెల్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ప్రశ్నించారు. అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గేయం విషయంలో దేశపతి శ్రీనివాస్, వి. ప్రకాష్ కోడిగుడ్లపై ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. "అందెశ్రీ కాల్ రికార్డింగ్‌లను విడుదల చేస్తారా? ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకున్న ప్రైవేటు డిస్కషన్ రికార్డును ఎలా విడుదల చేస్తారు?" అంటూ ధ్వజమెత్తారు.

పిల్లల కోసం బెంగ!

3 రోజులుగా శిశు విహార్ వద్దే పెంపుడు తల్లిదండ్రుల నిరీక్షణ

- అన్నం తింటున్నారో లేదో.. ఆరోగ్యం ఎలా ఉందో అంటూ కన్నీళ్లు
- ఒక్కసారి చూస్తాం.. లోపలికి అనుమతించండి అని వేడుకోలు
- లోపల ఉన్న 14 మంది చిన్నారుల్లో ఇద్దరు పిల్లలకు జ్వరం?
- 'కారా' రూల్స్ సడలించాలంటున్న స్వచ్ఛంద సంస్థలు
- విచారణ ముగిసేదాకా పిల్లలను చూసే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి
- సొంత తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. పిల్లలను అప్పగించండి:మంత్రి సీతక్క

హైదరాబాద్ సిటీ/యూసుఫ్‌గూడ, పంజాగుట్ట, మే 31 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి కనకున్నా.. ఆ పిల్లలను ఆ తల్లులు ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్నారు. వారే లోకంగా బతుకుతున్నారు. అలాంటిది.. తమ వద్ద నుంచి పిల్లలను దూరంచేస్తే ఆ తల్లిండ్రులు బాధపడరా? పది నిమిషాలు కనిపించకపోతేనే తల్లడిల్లిపోయే స్థితిలో మూడు రోజులుగా పిల్లలను చూడకుండా ఉన్న ఆ తల్లిదండ్రుల ఆవేదన ఏ స్థాయిలో ఉంటుంది? ఇదంతా యూసుఫ్‌గూడలోని శిశువిహార్ పరిసరాల్లో కళ్లకు కడుతోంది. నిజమే.. సెంట్రల్ ఆడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) నిబంధనలకు విరుద్ధంగా దత్తత తీసుకొని తప్పే చేశాం అంటూ లెంపలేసుకొంటూనే.. తమ బిడ్డల్ని ఒక్కసారి చూపించండి అంటూ అధికారులను తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారు. శిశువుల విక్రయానికి సంబంధించి అంత రాష్ట్రముతా గుట్టురట్టవ్వడంతో మూడు రోజుల క్రితం వివిధ చోట్ల నుంచి 14మంది శిశువులు, చిన్నారులను పోలీసులు స్వాధీనం చేసుకొని యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో అప్పగించారు. వీరిలో 12 మంది నెలల వయసు పిల్లలుండగా ఇద్దరు మూడేళ్లలోపు ఉన్నారు. శిశు విహార్‌లో ఉన్న తమ చిన్నారులు ఎలా ఉన్నారో? అన్నం తింటున్నారో లేదో? ఆరోగ్యం ఎలా ఉందో? అనే ఆలోచనతో పెంపుడు తల్లిదండ్రులు ఆకలిదప్పులూ పట్టకుండా బెంగటిల్లుతున్నారు. పిల్లలు వైద్యులపర్యవేక్షణలో ఉన్నా కొందరు జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

దత్తత ప్రక్రియ ఆలస్యం.. సంక్లిష్టం!

పొరుగు రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ, ఏపీలో పిల్లల దత్తత ప్రక్రియలో తీవ్ర ఆలస్యం జరుగుతుంది. ఈ కారణంగానే పిల్లలు లేని దంపతులు నిబంధనలకు విరుద్ధంగా శిశువులను దత్తత తీసుకుంటున్నట్లు సమాచారం. మహారాష్ట్ర, కర్ణాటకలో దరఖాస్తు చేసుకున్న ఆరు నుంచి ఏడాదిలోపు పిల్లల దత్తత ప్రక్రియ పూర్తవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం రెండు, మూడేళ్లు పడుతోందని స్వచ్ఛంద సంస్థల బాధ్యులు చెబుతున్నారు. పిల్లలను దత్తత తీసుకోవాలంటే తొలుత.. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత పాన్‌కార్డు నంబర్, రెసిడెన్స్ ప్రూఫ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వివాహ నమోదు పత్రం, దంపతుల బర్త్, హెల్త్ సర్టిఫికెట్లు సమర్పించాలి. భార్యాభర్తల పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతోపాటు ఇద్దరు కలిసి దిగిన పెళ్లి ఫొటోను కూడా దరఖాస్తుతో సమర్పించాలి. అలాగే రూ.6వేల డీడీ అప్లికేషన్ ఫారంతోపాటు రూ.40 వేలు దత్తత తీసుకునే సమయంలో సంబంధిత అనాథాశ్రమానికి లేకుంటే ప్రభుత్వ సంస్థలకు చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న అనంతరం రెండు నుంచి మూడేళ్లకు పిల్లలను దంపతులకు అప్పగిస్తారు. అప్పగించిన తర్వాత కూడా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు పిల్లలను పర్యవేక్షించాలి. దత్తత తీసుకున్న జంటల ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది? వారు పిల్లాడిని బాగా చూసుకుంటున్నారా? లేదా? అనేవి ప్రతి ఆరు నెలలకోసారి పరిశీలించాలి. ఈ సందర్భంగా సదరు తల్లిదండ్రుల నుంచి ఆరునెలలకోసారి రూ.2వేల చొప్పున తీసుకుంటారు.

3 రోజులుగా పడిగాపులు పడుతున్నాం

నా పేరు అరుణ. భర్త పేరు సాయి. మాది ఏపీలోని చీరాల సమీపంలోని బోయనపాలెం. పిల్లలు కలగకపోవడంతో ఐదు నెలల బాబును ఓ నర్సు ద్వారా తెచ్చుకున్నాం. బాబుకు శ్రీమన్విత్ అని పేరు పెట్టుకున్నాం. మా అమ్మకు నేను ఒక్కదాన్నే కావడంతో ఆమె ఎంతో ప్రేమతో నా బాబుకు ఎకరన్నర పొలం రాసేందుకు సిద్ధమైంది. ఇంతలోనే పోలీసులు మా బాబును తీసుకొచ్చి శిశువిహార్‌లో పెట్టారు. 3 రోజులుగా ఇక్కడే ఉన్నాం. చూసేందుకు అవకాశం ఇవ్వడం లేదు. దయచేసి మా బాబును మాకు ఇప్పించండి. - అరుణ, చీరాల, ఏపీ

3 నెలల్లోపు దత్తత ఇవ్వాలి

సమాజంలో చాలా జంటలు సంతానలేమి సమస్యతో బాధపడుతున్నారు. అలాంటి వారికి పిల్లలను దత్తత తీసుకునే అవకాశాన్ని త్వరగా కల్పించాలి. కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నాక మూడు నెలల్లో చట్టబద్ధంగా దత్తత ప్రక్రియ పూర్తి అయ్యేలా నిబంధనలు సడలించాలి. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలి. ప్రస్తుతం యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో ఉంటున్న పిల్లలను చూసే అవకాశాన్ని మానవతా దృక్పథంతో తల్లిదండ్రులకు కల్పించాలి.

-డాక్టర్ మమతా రఘువీర్, తరుణి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు

ప్రతి జిల్లాలో శిశువిహార్ పెట్టాలి



దత్తత కార్యక్రమం ఆలస్యమవుతుండడంతోనే చాలా మంది పిల్లలను అక్రమ పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం దత్తత టైం లిమిట్ తగ్గించి సకాలంలో పిల్లలను అప్పగిస్తే దంపతులు సంతోషంగా ఉండటంతోపాటు సంరక్షణను బాధ్యతగా నెరవేరుస్తారు. ప్రభుత్వం కూడా ప్రతి జిల్లాలో శిశువిహార్ కేంద్రాలు పెట్టాలి. తద్వారా అనాథ పిల్లలకు ఆశ్రయం అందుతోంది.

-రేవతి, హైకోర్టు న్యాయవాది

పాప పేరిట ఆస్తి కూడా రాశాం



ఈ దంపతులు పేర్లు పెరుగు దుర్గాభవాని, చక్రపాణి. వీరిది ఏపీలోని బాపట్ల జిల్లా కర్లపల్లి మండలం చింతాయపాలెం. పెళ్లయి 20 ఏళ్లయినా సంతానం కలగకపోవడంతో మూడేళ్ల క్రితం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సు సాయంతో 8 రోజుల పాపను రూ.1.5 లక్షలకు కొనుగోలు చేశారు. అధికారులొచ్చి తమ పాపను తీసుకెళ్లడంతో శిశువిహార్ వద్ద పడిగాపులు పడుతున్నారు. పాపకు భవ్యశ్రీ అని పేరు పెట్టుకొని, మూడేళ్లుగా పెంచుకుంటున్నామని.. ప్రాణం కంటే ఎక్కువగా చూసుకున్నామని చెప్పారు. "పాప పేరిట ఆస్తిని అంతా రాశాం. మంత్రి సీతక్క ఆఫీస్ అడ్రస్ చెప్పండి సార్.. అక్కడికి వెళ్లి అమ్మను ప్రాధేయపడి పాపను తీసుకెళ్తాం" అని ఈ దంపతులు అడుగుతున్నారు.

అక్రమ రవాణాపై కఠిన చర్యలు : సీతక్క



పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని శిశువిహార్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల కుటుంబసభ్యుల వివరాలు సేకరించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చి చిన్నారులను అప్పగించాలని సూచించారు. సంతానం లేని దంపతులు ప్రభుత్వ అనుమతితో, చట్టపరంగా దత్తత తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, దత్తత కోసం చట్టపరమైన ప్రక్రియను అనుసరించాలని పేర్కొన్నారు. పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

●డీఏవో శ్రీధర్‌రెడ్డి ● జిల్లా వ్యాప్తంగా ఎరువులు, విత్తనాల దుకాణాల్లో వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీసుల తనిఖీ



కోదాడలో మాట్లాడుతున్న ఆర్డీవో సూర్యనారాయణ

అర్వపల్లి, మే 31: నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని డీఏవో శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అర్వపల్లి మండల కేంద్రంలో శ్రీరామ ట్రేడర్స్ ఎరువుల షాపు, మన గ్రోమోర్ షాపులను తనిఖీ చేసి మాట్లాడారు. రైతులకు వరి, పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏవో శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

కోదాడ రూరల్: రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ కోరారు. శుక్రవారం కోదాడలో పట్టణ సీఐ రాము, తహసీల్దార్ సాయిగౌడ్, వ్యవసాయ అధికారి పాలెం రజనీతో కలిసి విత్తన దుకాణాలను ఆర్డీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన సరుకుకు దుకాణదారులు రశీదు ఇవ్వాలని, డీలర్లు రైతులకు సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సీఐ రాము మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పలు దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో రైతులు, విత్తనాల డీలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో వేణు మాధవరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్‌కుమార్, ఆర్ఐ అంజయ్య, ఏఎస్ఐ శంకర్ నాయక్, ఏఈవో శైలజ తదితరులు పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: విత్తనాల డీలర్లు, నర్సరీల యజమానులు నకిలీ విత్తనాలు, నాసిరకం మొక్కలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగయ్య హెచ్చరించారు. శుక్రవారం మేళ్లచెర్వు, చింతలపాలెం మండలాల్లోని రైతు వేదికల్లో విత్తనాల డీలర్లు, నర్సరీ నిర్వాహకులు, రైతులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. లైసెన్సు కలిగిన డీలర్ నుంచే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని, ప్రతి షాపు నిర్వాహకుడు ఖచ్చితంగా స్టాక్ బోర్డుపై విత్తనాల నిల్వలు, ధర ప్రతిరోజు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో మేళ్లచెర్వు, చింతలపాలెం ఎస్ఐ పరమేష్, సైదిరెడ్డి, సంధ్య, రియాజ్ పాల్గొన్నారు.

మునగాల రూరల్: మండలంలోని విత్తన దుకాణాలో మండల ప్రత్యేకాధికారి శిరీష, వ్యవసాయాధికారి అనిల్‌కుమార్, తహసీల్దార్ ఆంజనేయులు తనిఖీ చేశారు. విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని, ఎమ్మార్పీకే విక్రయించాలని కోరారు. రైతులు కొనుగోలు చేసిన సరుకుకు దుకాణదారులు రసీదులు ఇవ్వాలని కోరారు. అనంతరం స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్, రైతు కొనుగోలు రిజిస్టర్‌ను పరిశీలించారు. పత్తి విత్తనాల కృత్రిమ కొరత రాకుండా చూడాలని కోరారు.



మేళ్లచెర్వులో దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు



అర్వపల్లిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఏవో శ్రీధర్‌రెడ్డి

మద్దిరాల: రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎస్ఐ మధునాయుడు అన్నారు. మండల కేంద్రంలోని పురుగు మందులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు.

తిరుమలగిరి: లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని మండల ఏవో వెంకటేశ్వర్లు సూచించారు.తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలోని పలు విత్తనాల దుకాణాలను తహసీల్దార్ సుధ, ఎస్ఐ సత్యనారాయణతో కలిసి తనిఖీ చేసి మాట్లాడారు.

హుజూర్‌నగర్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ఏవో స్వర్ణ అన్నారు. తహసీల్దార్, నాగార్జునరెడ్డి, ఎస్ఐ జి.ముత్తయతో కలసి పట్టణంలోని విత్తన విక్రయ కేంద్రాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. రైతులకు సబ్సిడీపై జీలుగు విత్తనాలు ఏవో కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు

లైంగిక వేధింపుల ఆరోపణలపై విచారణ

సూర్యాపేట(కలెక్టరేట్), మే 31: కాపుగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి ప్రోగ్రాం అధికారి, అసంక్రమణ వ్యాధులు, ఫుడ్ సేఫ్టీ సర్వీసెస్ అధికారి డాక్టర్ కల్యాణ్ చక్రవర్తిపై లైంగిక ఆరోపణలు రావడంతో విచారణ చేయిస్తున్నామని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ, లైంగిక వేధింపుల నివారణ నిషేధ చట్టం కింద విచారణ చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కల్యాణ చక్రవర్తి మానసికంగా, లైంగికంగా వేధించాడని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విధులు నిర్వహించే మానసిక ఆరోగ్య వైద్య నిపుణులు డీఎంహెచ్‌వోకి ఈ నెల 20వ తేదీన ఫిర్యాదు చేశారన్నారు. దీంతె డాక్టర్ కల్యాణ్ చక్రవర్తిపై ఈనెల 28వ తేదీన కేసు నమోదైందని తెలిపారు. అయితే, కల్యాణ్ చక్రవర్తి అందుబాటులో లేడని సమాచారం.

వైద్యుడిపై కేసు నమోదు

కోదాడ, మే 31: తప్పుడు ధ్రువ పత్రాలతో వైద్యం అందిస్తున్న వైద్యుడిపై కేసు నమోదు చేసినట్లు కోదాడ టౌన్ సీఐ టి.రాము తెలిపారు. శుక్రవారం కోదాడలో ఈ కేసు వివరాలను సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన వన్నా యశ్వంత్‌కుమార్ కోదాడలో నాలుగేళ్ల నుంచి నివసిస్తున్నాడు. యశ్వంత్‌కుమార్ ఎంబీబీఎస్ ఉక్రెయిన్‌లో చదివాడు. అనంతరం వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంది. తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను డౌన్లోడ్ చేసుకుని నకిలీ సర్టిఫికెట్ రూపొందించి కోదాడలో ఓ ఆస్పత్రి ప్రారంభించి వైద్యం చేస్తున్నాడు. ఇటీవల ఆ నకిలీ సర్టిఫికెట్‌తో రిజిస్ట్రేషన్ కోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి దరఖాస్తు చేశాడు. ఈ నేపథ్యంలో సూర్యాపేట డీఎంహెచ్‌వో కోటాచలం ఆ సర్టిఫికెట్‌ను తెలంగాణా స్టేట్ మెడికల్ కౌన్సిల్ వెబ్‌సైట్ నుంచి పరిశీలించి నకిలీదని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. యశ్వంత్‌పై ఫోర్జరీ, చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



ఫర్జానా (ఫైల్ ఫొటో)

గరిడేపల్లి, మే 31: కుటుంబ తగాదాలతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం పొట్లపాడు గ్రామానికి చెందిన మహ్మద్ ఫర్జానా(30)కు గరిడేపల్లి మండలం కుతుబ్‌షా పురం గ్రామానికి చెందిన మహ్మద్ బాబాతో పదేళ్ల క్రితం క్రితం వివాహం జరిగింది. ఆమెను భర్త కొంత కాలంగా మానసికంగా వేధించడంతో జీవితంపై విరక్తి చెంది కుతుబ్ షాపురంలో గురువారం ఇంటిలో ఎవరూలేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఫర్జానాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లి సయ్యద్ సైదాబీ ఫిర్యాదు మేరకు మహ్మద్ బాబాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

పాఠశాలలో చెట్ల నరికివేతపై గ్రామస్థుల ఆగ్రహం

తుంగతుర్తి, మే 31: మండలంలోని తూర్పుగూడెం ప్రాథమిక పాఠశాలలో అక్రమంగా చెట్లను నరికివేయడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోతులు, చెట్ల మీద ఉండి ఇబ్బందులు పెడుతున్నాయని పాఠశాల హెచ్ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాల నిర్వాహకులు చెట్లను నరికివేయడంతో గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఎంఈవో బోయిని లింగయ్య లిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు హనుమాన్ జయంతికి ఏర్పాట్లు

హుజూర్‌నగర్ రూరల్, మే 31: పట్టణంలోని గోవిందాపురంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం నిర్వహించే హనుమాన్ జయంతి సందర్భంగా పత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం ఏడు గంటలకు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, అనంతరం హోమం, పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అదే విధంగా పట్టణంలోని దీక్షిత్ నగర్‌ని ఆంజనేయస్వామి దేవాలయాన్ని ముస్తాబు చేశారు. మండలంలోని గోపాలపురంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అన్నదానం చేయడానికి భక్తులు బియ్యం అందచేశారు. కార్యక్రమంలో కుంట సైదులు, ములకలపల్లి సీతయ్య, వెంకటేశ్వర్లు, అమర్‌నాథ్‌రెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాస్, అంజిరెడ్డి, వీరబాబు, పిచ్చయ్య,ఆదినారాయణ,వెంకటేశ్వర్లు,ప్రగత్, సన్నీ, బండారు శ్రీను, శివకుమార్, పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని కూచిపూడి తండాలోని శ్రీసీతారామ అభయాంజనేయస్వామి దేవాలయంలో శనివారం హనుమాన్ జయంతిని నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఉదయం 7.30 గంటలకు విశేషపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, అభయాంజనేయ స్వామికి పంచామృత అభిషేకం, అనంతరం స్వామివారికి ఆకుపూజ, నీరాజన మంత్రపుష్పాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్నదానం నిర్వహిస్తారు.

బూరుగడ్డ దేవాలయంలో ప్రత్యేక పూజలు

హుజూర్‌నగర్ రూరల్, మే 31: మండలంలోని బూరుగడ్డ శ్రీఆదివరహ లక్ష్మీనరసింహవేణుగోపాలస్వామి దేవాలయంలో శుక్రవారం గోపూజ నిర్వహించారు. కార్యక్రమంలో గోవిందరెడ్డి, రంగ రామానుజన్, వెంకటచలపతి, హరీష్, మనోహర్, గోపాల్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

దిర్శించర్ల ఊర చెర్వు సర్వే పనులు ప్రారంభం



దిర్శించర్ల ఊర చెరువును సర్వే చేస్తున్న అధికారులు

నేరేడుచర్ల, మే 31: మండలంలోని దిర్శించర్ల గ్రామంలోని ఊర చెర్వు సర్వేను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు శుక్రవారం సర్వే చేపట్టారు. పక్కనే ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న రైతులు చెరువును ఆక్రమించారని వచ్చిన ఫిర్యాదు మేరకు సర్వే నెం.52లో అధికారులు సర్వే చేశారు.. మొత్తం 111.26 ఎకరాలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 50ఎకరాలు కూడా లేదంటూ ఫిర్యాదులు అందాయి. దీంతో అధికారులు సర్వే చేసి ఆక్రమణలు వెలికితీసి రాళ్ల పాతనున్నారు. ఆక్రమించుకున్నట్లు తేలితే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ డీఈ అమరేందర్‌రెడ్డి, ఏఈ సతీష్, ఆర్ఐ నర్సయ్య, సర్వేయర్ గాయత్రి, సిబ్బంది రాము, మోహినుద్దీన్, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన కేసీఆర్'



మఠంపల్లిలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

మఠంపల్లి, మే 31: మాజీ సీఎం కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్ చేయించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. . శుక్రవారం మఠంపల్లిలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ లాంటి ఉద్యమకారుడు చేయించిన ఇలాంటి పనులను వింటుంటే రాజకీయాంటే యువతకు ఏవగింపు కలుగుతోందన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేసీఆర్, హరీష్‌రావు మౌనం వీడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పున్నయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐటీయూసీ నాయకులు ఊదర వెంకన్న, వెంకటరెడ్డి, బడేసా తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యం రావాలి



సూర్యాపేటలో మాట్లాడుతున్న నాగయ్య

సూర్యాపేటఅర్బన్, మే 31: దేశంలో, రాష్ట్రంలో బహుజన రాజ్యం రావాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆరుట్ల జానకిరాములు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో రెవెల్యూషన్ ఆఫ్ మారోజు పార్టీ నాయకుడు చామకూరి నర్సయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మారోజు వీరన్న వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బహుజనులకు అధికారం రావాలని మారోజు వీరన్న కలలు కన్నారని తెలిపారు. 'మేమెంత మందో.. మాకు అంత వాటా' అని మారోజు వీరన్న పోరాటం సాగించారని గుర్తుచేశారు. ప్రత్యామ్నాయ రాజకీయాల నిర్మాణాల బాధ్యత కమ్యూనిస్టులు, బహుజనులదేనని తెలిపారు. దళితబహుజన కులాలను వేల సంవత్సరాలుగా భూములకు, సంపదకు, అధికారానికి దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు నెల్లుట్ల ఉపేందర్, బానుప్రసాద్, అబ్దుల్ కరీం, మాదవరెడ్డి, వెంకట్, చెర్కుపల్లి లక్ష్మణ్, ఉపేందర్, నాగరాజు, పవన్, నాగమణి, బేగం రజియా పాల్గొన్నారు.

'ఉపాధి'లో అవకతవకలు జరిగాయని ఫిర్యాదు



ఏపీవో జ్యోతికి ఫిర్యాదు చేస్తున్న తమ్మావరం గ్రామస్థులు

మేళ్లచెర్వు, మే 31: 'ఉపాధి' పథకంలో అవకతవలకు జరుగుతున్నాయని చింతలపాలెం మండలం తమ్మవరం గ్రామస్థులు డీఆర్‌డీఏ పీడీ మధుసూదనరాజు, ఏపీవో జ్యోతికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. పనులకు రానివారికి కూడా తమ్మవరం గ్రామపంచాయతీలోని 'ఉపాధి' ఫీల్డ్ అసిస్టెంట్ మస్టర్‌లో నమోదు చేస్తూ అక్రమాలకు పాల్పడుతోందని ఫిర్యాదులో ఆరోపించారు. 18 సంవత్సరాలు నిండనివారికి 'ఉపాధి' పథకంలో ఫీల్ అసిస్టెంట్ చేర్పించి గతంలో డిస్మిస్ అయిందని, ఆ తర్వాత విధుల్లో చేరినా ఆమె ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. గ్రామంలోని పేదలకు పనికల్పించకుండా, వేరే ప్రాంతంలో ఉన్నవారని మస్టర్లు వేసి చెరి సగం పంచుకుంటున్నారని ఆరోపించారు. ఫీల్ అసిస్టెంట్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని, అర్హులైన పేదలకు న్యాయం చేయాలని కోరారు.

బడిబాటలో అందరూ భాగస్వామ్యం కావాలి



కోదాడలో మాట్లాడుతున్న ఆర్డీవో సూర్యనారాయణ

కోదాడ, మే 31: ఈ నెల మూడో తేదీ నుంచి 11వ తేదీ వరకు బడిబాట కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆర్డీవో సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచి, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో సలీంషరీఫ్, తహసీల్దార్ సాయిగౌడ్, సీఐ రాము, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: 'బడి బాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో పవన్‌కుమార్ అన్నారు. పాఠశాలల బలోపేతంపై చింతలపాలెం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో సైదానాయక్, తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ సైదిరెడ్డి పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: 'బడిబాట'ను విజయవంతం చేయాలని ఎంఈవో నకిరేకంటి రవి అన్నారు. పెన్‌పహాడ్ మండల కేంద్రంలో రైతు వేదిక కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సెర్ప్ ఏపీఎం, ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంల, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ మట్టయ్య, ఏవో కృష్ణసందీప్, అజయ్‌నాయక్ పాల్గొన్నారు.

గరిడేపల్లి: బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని తహసీల్దార్ బండ కవిత అన్నారు. బడిబాట కార్యక్రమంలపై మండల పరిషత్ కార్యాలయంలో హెచ్ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో ఛత్రునాయక్, ఏపీఎం శ్రీనివాస్, హెచ్ఎంలు ఎం.సువర్ణ, శ్రీనివాసరావు, దీప్తి, ఉమా, రాంబాబు, ప్రభాకర్‌రెడ్డి, చైర్మన్లు మరియమ్మ, సావిత్రి, అరుణ, సీఆర్పీలు రామకృష్ణ, అశోక్‌కుమార్, రాములు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయలని ఎంఈవో రాములునాయక్ కోరారు. మద్దిరాల ఎంపీడీవో కార్యాలయంలో హెచ్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, వీఏవోలతో జరిగిన సమావేశంలో అయన మాట్లాడారు.

నాగారం: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ధార శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఐ పి. వెంకట్‌రెడ్డి. ఎంఈవో బాలునాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, ఏపీఎం శోభ. హెచ్ఎంలు, ఆదర్శ పాఠశాలల చైర్మన్లు పాల్గొన్నారు.

తుంగతుర్తి: బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో బోయిని లింగయ్య కోరారు. మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమంపై హెచ్ఎంలు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

తిరుమలగిరి: బడి ఈడు పిల్లలను పాఠశాల్లో చేర్పించాలని ఎంపీడీవో లాజర్, ఎంఈవో శాంతయ్య అన్నారు. తిరుమలగిరిలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఎస్ఎంసీ చైర్మన్లు, హెచ్ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధ, మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, ఎంపీవో మారయ్య, వివిధ పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.



తుంగతుర్తిలో మాట్లాడుతున్న ఎంఈవో బోయిని లింగయ్య

పనులు సకాలంలో పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సునీత

నూతన్‌కల్, మే 31: అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో సునీత కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో హెచ్ఎంలు, సంఘ బంధాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికి పనులు పూర్తి కావాలన్నారు. అదేవిధంగా ఈ నెల మూడో తేదీ నుంచి నిర్వహించే బడిబాట కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములు చేసి ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. సమావేశంలో ఎంఈవో రాములు నాయక్, ఏపీఎం కరుణాకర్, హెచ్ఎంలు, పీఆర్పీలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

హుజూర్‌నగర్, మే 31: గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అధికారులను కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఉపాధి' పనులు సక్రమంగా చేయాలని, మిషన్‌భగీరథ నీరు ఇంటింటికీ అందించాలని కోరారు. చెరువుల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులు ఆక్రమిస్తే సహించేది లేదన్నారు. ఆంధ్ర సరిహద్దు ప్రాంతం నుంచి తెలంగాణకు నకిలీ విత్తనాలు రాకుండా అరికట్టాలన్నారు. రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. గ్రామాల్లో నీటి సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లావణ్య, జడ్పీ టీసీ కొప్పుల సైదిరెడ్డి, మచ్చ వెంకటేశ్వర్లు, దొంగిరి వెంకటేశ్వర్లు, కట్టా గోపాలరావు, శౌరెడ్డి, పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల సంక్షేమానికి కృషి

హుజూర్‌నగర్, మే 31: కల్లుగీత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని గౌడ సంఘం నాయకులు దొంతగాని శ్రీనివాస్, వల్లపుదాసు కృష్ణ, నర్సింగ్ వెంకటేశ్వర్లు, బెల్లంకొండ చిరంజీవిలు కోరారు. శుక్రవారం పట్టణంలోని కాటమయ్య దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన సంఘ సమావేశంలో మాట్లాడారు ఈ నెల 9న పట్టణంలో కాటమయ్య పండుగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అమర్‌గౌడ్, యరగాని గురవయ్య, శ్రీనివాస్, తండు సాయిరాం, మట్టయ్య, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, యలక వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, వీరయ్య ప్రసాద్ పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజం కోసం కృషి చేయాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సూర్యాపేట అర్బన్, మే 31: పొగాకు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని డాక్టర్ సరేష్ అన్నారు అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని వెన్నెల ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. పొగాకు ఉత్పత్తుల వినియోగంతో 60రకాల క్యాన్సర్ల బారిన పడే అవకాశం ఉందన్నారు. పొగ తాగడం ప్రారంభించిన ఆరు నుంచి 10సెకండ్లలో నికోటిన్ మెదడుకు చేరుతుందని, అనతి కాలంలోనే గుండెపోటు, పక్షవాతం వచ్చే అవకాశం ఉందన్నారు. ముందుగా పొగాకు మానేస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వెన్నెల ఆసుపత్రి నిర్వాహకుడు భయ్యా నారాయణ, భయ్యా దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



సూర్యాపేట టౌన్: తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జిల్లా కేంద్రానికి చెందిన పనిగంటి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని సప్తగిరి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన సద్ది వెంకట్‌రెడ్డి, రాష్ట్రనాయకులు గందేశ్వర్, వేణుగోపాలకు కృతజ్ఞతలు తెలిపారు.

మఠంపల్లి: కార్మికులు, కర్షకులు, రైతులు, పేదలకు అండగా ఎర్రజెండా అండగా నిలిచి పోరాటాలు చేస్తోందని సీఐటియూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్‌మియా అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొనిమండల కేంద్రంలో జెండాను అవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మంగళపల్లి షైసయ్య, గుర్వారెడ్డి, నరసింహారెడ్డి, గురవయ్య, భూక్యసైదా, జయరాజ్, కె.వెంకటేశ్వర్లు, సైదులు, పూల నాగరాజు, వీరజానకి, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: ధూమపానానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ బట్టు మధు అన్నారు. ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆయన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతూ ధూమపానంతో ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో పాటు అనేక వ్యాధులు వస్తున్నాయన్నారు. ఆరోగ్యంపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ యడవెల్లి సత్యానారాయణరెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు జిలకర రామస్వామి, కర్రి సూర్యనారాయణరెడ్డి, యూసుఫ్, చిత్రం విశ్వనాథ్, వీరారెడ్డి, ఏసు పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: పచ్చిరొట్ట ఎరువుకు ఉపయోగించే జీలుగ విత్తనాల మేళ్లచెర్వు మండల కేంద్రంలోని పీఏసీఎస్ బ్యాంక్‌లో అందుబాటులో ఉన్నాయని ఉమ్మడి మండల వ్యవసాయాధికారి పెద్ది శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 30కిలోల జీలుగ బస్తాను రూ.1116లకు విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కోదాడ రూరల్: ఆర్టీసీ బస్సు కండక్టర్‌గా రామనాథం చేసిన సేవలు మరువలేనివని కోదాడ డిపో మేనేజర్ హర్ష అన్నారు. శుక్రవారం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేసి ఉద్యో విరమణ చేసిన రామనాథాన్ని పలువురు ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఐ నాగశ్రీ, డ్రైవర్లు, కండక్టర్‌లు, బంధువులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని వాయిలసింగారం గ్రామ అభివృద్ధికి సర్పంచ్‌గా గద్దె రామారావు ఎంతో కృషి చేశారని పలువురు కొనియాడారు. గ్రామంలో నిర్వహించిన రామారావు తొమ్మిదో వర్ధంతి సందర్భంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ వెంపటి వెంకటేశ్వరరావు, తెల్లబెల్లి పీఏసీఎస్ చైర్మన్ బుర్రా వెంకటేశ్వర్లు, కొల్లు సుబ్బారావు, నందిగామ శ్రీనివాస్, వెంకన్న, గద్దె చిన్న రామారావు, కోటయ్య, యశ్వంత్, రామారావు, అరుణ, గద్దె రఘు, రమ పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని తమ్మరబండపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన చుండూరు ప్రసాదరావును యూటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. ప్రసాదరావు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి, వీరబాబు, రంగారావు, అనంతారపు కృష్ణయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పీటీఐల జిల్లా కమిటీ సభ్యుడు రాజీవ్ కోరారు. శుక్రవారం మండలంలోని తాటిపాముల గ్రామంలో ఆయన మాట్లాడారు. సమగ్ర శిక్షా అభియాన్‌లో 14ఏళ్లుగా అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నామని, సంవత్సరంలో 10 నెలలు మాత్రమే పని చేయించుకుని వేసవిలో విధుల నుంచి తొలగిస్తున్నందున ఇబ్బంది పడుతున్నామన్నారు. వెంటనే విధుల్లోకి తీసుకొని కనీసం వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పీటీఐలు స్వప్న, నీరజ, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

నాగారం: మండల కేంద్రంలో 133/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈఈ మహేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.